సాక్షి
మహబూబ్‌నగర్
శనివారం । 11 । ఫిబ్రవరి । 2023



నేడు లోక్ అదాలత్
లోక్అదాలత్‌లో శనివారం ఇరువర్గాల సమస్యలను రాజీ పద్ధతిలో పరిష్కరిస్తారు.
వివరాలు 8లో ▸



వడ్ల బస్తాల్లో కంకర రాళ్లు
వడ్ల బస్తాల్లో కంకరరాళ్లు కలిపి విక్రయిస్తున్న ఘటన బాదేపల్లిలో వెలుగు చూసింది.
వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
34.2 /17.4
వాతావరణం
ఆకాశం తేటగా ఉంటుంది. ఉదయం కాస్త చల్లని గాలులు వీస్తాయి. మధ్యాహ్నం ఎండ ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

మాతా శిశు మరణాలు లేకుండా చూడాలి

పాలమూరు: జిల్లాలోని ప్రభుత్వ **సివిల్ ఆస్పత్రులు**, అర్బన్ హెల్త్‌సెంటర్స్, **ప్రాథమిక** ఆరోగ్య కేంద్రాల్లో మాతా శిశు **మరణాలు** జరగకుండా ప్రత్యేక చర్యలు **చేపట్టాలని జిల్లా** వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ కృష్ణ అన్నారు. జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో శుక్రవారం ప్రోగ్రామ్ అధికారులతో పాటు నూతన మెడికల్ ఆఫీసర్లతో ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో గర్భిణీల వివరాలు సేకరించి వాటిని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఇమ్యూనైజేషన్ క్రమం తప్పకుండా పంపిణీ చేయాలని, నవజాత శిశువులతో పాటు చిన్నారులకు టీకాలు ఇవ్వాలన్నారు. జిల్లావ్యాప్తంగా కొత్తగా క్షయ కేసులు గుర్తించి, అవసరం అయిన వారికి మందులు పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ భాస్కర్‌నాయక్, డాక్టర్ కిరణ్మయి, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి శంకర్, క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ రఫీక్, మలేరియా అధికారి శ్వేత ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి: మంత్రి



జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): వాల్మీకి బోయ కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చాలని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో బోయలు తీవ్ర అన్యాయానికి గురయ్యారని, సీఎం కేసీఆర్ వారిని ఎస్టీ జాబితాలో చేర్చాలని అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసినట్లు చెప్పారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణచౌరస్తాలో సీఎం కేసీఆర్, వాల్మీకి మహర్షి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. మంత్రి మాట్లాడుతూ.. 1956 నుంచి తమను ఎస్టీ జాబితాలో చేర్చాలని వాల్మీకి బోయలు ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేస్తున్నా స్పందించలేదన్నారు. అడవిలో వేటాడటమే వృత్తిగా ఉన్న బోయలకు ప్రస్తుతం కుల వృత్తి లేదన్నారు. ఆర్థికంగా ఎంతో వెనుకబడిన వాల్మీకిలను ఎస్టీ జాబితాల్లో చేరిస్తే విద్య, ఉద్యోగ అవకాశాలు రిజర్వేషన్లు పొందడమే కాకుండా రాజకీయంగా అవకాశాలు లభిస్తాయన్నారు. గతంలో అసెంబ్లీలో రిజర్వేషన్ కోసం తీర్మానం చేసి పంపించిన ఫార్మట్ మార్చి పంపాలని కేంద్రం అడగడంతో మరోసారి తీర్మానం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నర్సింహులు, వాల్మీకి బోయ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రామ్‌లక్ష్మణ్, పెద్ద నర్సింహ, యుగేంధర్‌నాయుడు, కురుమూర్తి, బుచ్చి రాములు, కృష్ణ వెంకట్రాములు పాల్గొన్నారు.

విజయంతో తిరిగి రావాలి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: కర్ణాటకలోని బెంగళూరులో ఈనెల 12న జరిగే ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ క్రాసకంట్రీ పోటీలకు ఎంపికైన పీయూ క్రీడాకారులు శుక్రవారం పయనమయ్యారు. అంతకుముందు వారికి పరీక్షల నిర్వహణ అధికారి డా.రాజ్‌కుమార్, ఐయూటీ కార్యదర్శి, పీయూ పీడీ కె.బాల్‌రాజ్‌తో కలిసి ట్రాక్‌షూట్, క్రీడా దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జట్టులోని క్రీడాకారులు బాగా రాణించి విజయంతో పీయూకి పేరుప్రతిష్ఠలు తీసుకురావాలన్నారు. అందరూ క్రీడాస్ఫూర్తితో మెలగాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా టీం కోచ్, మేనేజర్ దివ్యశ్రీ, పీఈటీ శ్వేత పీయూ సిబ్బంది శ్రీనాథ్, నరేష్, మన్యం తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య కోరలు..!

గుండేడ్‌వాసుల దినదిన గండం



మహవీర్ పరిశ్రమను మూసివేయాలని ధర్నా చేస్తున్న గుండేడ్ గ్రామస్తులు (ఫైల్)

- వాయు కాలుష్యం తీవ్రతతో ఆస్పత్రుల పాలవుతున్న గ్రామస్తులు
- అత్యంత ప్రమాదకరంగా పరిణమించిన ఐరన్ పరిశ్రమ
- కలెక్టర్, పొల్యూషన్ బోర్డు అధికారులకు ఫిర్యాదు
- తక్షణమే మూసివేయాలని స్థానికుల పోరాటం



బాలానగర్: మండలంలోని గుండేడ్ వాసులు కాలుష్యపు కోరల్లో చిక్కి దినదిన గండంగా జీవనం సాగిస్తున్నారు. గ్రామ శివారులోని మహవీర్ పరిశ్రమ వెదజల్లే వాయు కాలుష్యంతో రోగాల బారిన పడుతున్నారని, తీవ్రమైన నల్లటి పొగ పంటలను, భూములను నాశనం చేస్తుందని వాపోతున్నారు. అలాగే నల్లటి దుమ్ముతో కూడిన గడ్డిని తిని పశువులు సైతం మృత్యువాత పడుతున్నాయని, పాల ఉత్పత్తి తక్కువగా వస్తుందని, కూరగాయలు కూడా పండించుకోలేని దుస్థితి దాపురించింది. ఈ క్రమంలో తక్షణమే పరిశ్రమను మూసివేయాలని డిమాండ్ చేస్తూ వారం రోజులుగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నారు. పొల్యూషన్ బోర్డు అధికారులు, కలెక్టర్‌కు సైతం పలుమార్లు ఫిర్యాదులు చేశారు.

విస్తరణకు నిరాకరణ..

గతంలో పరిశ్రమ విస్తరణకు అనుమతి కోరుతూ గ్రామంలో ప్రజాభిప్రాయం సేకరించగా.. ముక్తకంఠంతో వ్యతిరేకించారు. ఎన్నో ఏళ్లుగా మూసి ఉన్న పరిశ్రమను ఎలాంటి సమాచారం లేకుండా, పొల్యూషన్ కంట్రోల్ పరికరాలు ఉపయోగించకుండా తిరిగి ప్రారంభించి తీవ్ర వాయు కాలుష్యానికి కారణమవుతుండటంతో గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. అప్పట్లో స్పందించిన పరిశ్రమ యాజమాన్యం నెల రోజుల్లో కాలుష్య నియంత్రికలు బిగిస్తామని హామీ ఇచ్చినా ఇప్పటికీ అలాంటి చర్యలు చేపట్టలేదు.



వాయు కాలుష్యం వస్తుందని చెబుతున్న పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఏఈ సంగీత లక్ష్మి

గ్రామస్తులపైనే కేసులు..

ప్రస్తుతం ఉత్పత్తి పెంచడంతో తీవ్రమైన వాయు కాలుష్యం విడుదల చేస్తుండటంతో గుండేడ్ గ్రామస్తులే కాకుండా సమీప పరిశ్రమలోని కార్మికులు వందల సంఖ్యలో మహవీర్ పరిశ్రమ వద్దకు చేరి ధర్నా నిర్వహించారు. పరిశ్రమల నిర్లక్ష్య వైఖరిని ప్రశ్నించిన తమపై పోలీస్‌స్టేషన్‌లో కేసులు సైతం నమోదు చేయించారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. తర్వాత గ్రామ సర్పంచ్ నర్సింహారెడ్డి ఫిర్యాదుతో పరిశ్రమలో తనిఖీలు చేసి పరీక్షలు చేసిన పొల్యూషన్ బోర్డు అధికారులు ఆ తర్వాత ఎలాంటి చర్యలు చేపట్టలేదు. దీంతో గ్రామస్తులు ధర్నా చేపట్టడంతో పొల్యూషన్ బోర్డు ఏఈ సంగీత లక్ష్మి గత నెలలో పరిశీలించారు. అక్కడి పరిస్థితిపై విలేకరులు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా పరిశ్రమలో పొల్యూషన్ కంట్రోల్ పరికరాలు పని చేయడం లేదని, ఈ విషయమై ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

చర్యలు తీసుకోలేదు..



పరిశ్రమ నుంచి రాత్రి వేళలో విపరీతమైన వాయు కాలుష్యం వస్తుంది. దీంతో గ్రామస్తులు శ్వాసకోశ వ్యాధుల బారిన పడుతున్నారు. పశువులు, మేకలు మృతిచెందాయి. ఈ విషయాలపై పలుమార్లు ధర్నాలు చేసినా, ఫిర్యాదులు చేసినా అధికారులు ఏనాడు చర్యలు తీసుకోలేదు. దయచేసి మాకు న్యాయం చేయండి. మమ్మల్ని తీవ్రమైన వాయు కాలుష్యపు పరిశ్రమ నుంచి కాపాడండి.

– శ్రీశైలం, గుండేడ్

ఎందుకు బంద్ చేయరు..?



పరిశ్రమలో ఇంత వాయుకాలుష్యం వస్తుంటే ప్రజల శ్రేయస్సు కోసం ఎందుకు బంద్ చేయరు. ఈ విషయంపై గతంలో కూడా పరిశ్రమ ముందు ధర్నాలు చేసినా కేవలం 15, 20 రోజుల్లో చర్యలు చేపడతామన్న పరిశ్రమ యాజమాన్యం ఏళ్లతబడిగా ఎందుకు కాలుష్య నివారణకు చర్యలు చేపట్టలేదు. పొల్యూషన్ బోర్డు రిటైర్డ్ ఈఈ దయానంద్ పరిశ్రమ వ్యక్తులతో కలిసే ఉన్నాడు. ప్రజల ప్రాణాలకు నష్టం కలిగించే పరిశ్రమను మూసి వేయాలి.

– నర్సింహులు, గుండేడ్ వార్డు సభ్యుడు

పరిశ్రమను తరలించాల్సిందే..



గ్రామానికి కేవలం వంద మీటర్ల దూరంలో ఉన్న వాయు కాలుష్య పరిశ్రమను మూసి వేయాల్సిందే. తీవ్ర వాయు కాలుష్యంతో గ్రామంలో నాతోపాటు ఎంతోమంది రోగాల బారినపడ్డారు. ఏకంగా గతంలో ప్రభుత్వం వారం రోజులపాటు మెడికల్ క్యాంపు కూడా ఏర్పాటు చేసింది. ఇంతటి వాయు కాలుష్యపు పరిశ్రమను గ్రామం నుంచి తరలించాల్సిందే.

– నర్సింహారెడ్డి, సర్పంచ్, గుండేడ్

ఉన్నతాధికారులకు నివేదిస్తాం

పరిశ్రమలో విచారించిన అంశాలపై ఉన్నతాధికారులకు 24 గంటల్లో నివేదిక అందజేస్తాం. పరిశ్రమలో వాయు కాలుష్య నివారణకు సంబంధించిన పరికరాలు వాడకపోవడంతోనే ఇలాంటి పరిస్థితి దాపురించింది. దీనిపై వారం రోజుల్లో నివేదిక తయారు చేసి నెల రోజుల్లో పరిశ్రమపై చర్యలు ఉంటాయి.

– సంగీతలక్ష్మి, పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు ఏఈ

మిస్టరీగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి

- అనుమానాస్పద మృతిగా కేసు నమోదు
- ఆస్తి వివాదమే కారణమనే అనుమానాలు?



మణికంఠ వర్మ (ఫైల్)

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/వనపర్తి: మేడ్చల్ జిల్లా బాచుపల్లి మండలం ప్రగతినగర్‌లోని మధురానగర్ కాలనీకి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మణికంఠవర్మ (29) మృతి మిస్టరీగా మారింది. తన పెంపుడు కుక్కకు మందులు కొనేందుకు బుధవారం ఉదయం కారులో ఇంటి నుంచి బయలుదేరిన ఆయన వనపర్తి జిల్లా శ్రీరంగాపుర్ మండలం జానంపేట శివారులోని రామసముద్రం చెరువులో గురువారం శవమై తేలడం పలు అనుమానాలకు తావిస్తోంది. తనకు ఎలాంటి సంబంధం లేని ఆ ప్రాంతానికి ఎందుకు వచ్చారు.. ఒక్కడే వచ్చారా.. అతనితో పాటు ఎవరైనా ఉన్నారా.. లేక ఇంకెవరైనా తీసుకొచ్చారా.. ఇలా అనేక రకాల ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. రామసముద్రం చెరువులో నుంచి మృతదేహాన్ని వెలికితీసిన పోలీసులు సర్పంచ్ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద స్థితిలో మృతిచెందినట్లు కేసు నమోదు చేశారు. శుక్రవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో జిల్లాకేంద్రంలోని జనరల్ ఆస్పత్రిలో మృత దేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. అయితే ఆస్తి వివాదమే ప్రాణం తీసిందని మృతుడి కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. దీని వెనుక ఓ ప్రధాన పార్టీకి చెందిన నాయకులు ఉన్నారని చెబుతుండడం కలకలం సృష్టిస్తోంది. మృతుడి తల్లి విష్ణుప్రియ, అక్క అన్నపూర్ణదేవి కథనం ప్రకారం.. బుధవారం 11.15 గంటలకు కుక్కపిల్లకు మందులు కొని తీసుకువస్తానని మణికంఠవర్మ తన కారులో ఇంటి నుంచి బయలుదేరాడు. పక్కనే ఉన్న షాప్‌కు వెళ్లిరావడానికి ఎందుకింత ఆలస్యమైందని 11.50కి మృతుడికి కాల్ చేస్తే మొబైల్ స్విచ్ ఆఫ్ అని వచ్చింది. ఆందోళనతో వారు అతడి స్నేహితులు, తమ బంధువులకు ఫోన్ చేసినా ప్రయోజనం లేకపోవడంతో సాయంత్రం జేఎన్‌టీయూ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. వారు ప్రగతినగర్ బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధికి వస్తుందని.. రాత్రి వరకు చూసి అక్కడ ఫిర్యాదు చేయాలని సూచించారు. అర్ధరాత్రి 11 గంటల వరకు మణికంఠవర్మ ఇంటికి రాకపోవడంతో బాచుపల్లి స్టేషన్‌లో రాత్రి 11.15 గంటలకు ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత పోలీసులు ఇతర పోలీస్ స్టేషన్లకు సమాచారం ఇస్తాం.. ఉదయం రమ్మని చెప్పారు. కాగా, బుధవారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఒకసారి ఫోన్ ఆన్ అయినట్లు మెసేజ్‌లు వచ్చాయి. కాల్ చేస్తే.. రెండు రింగులకే మళ్లీ కట్ అయ్యి ఆఫ్ అయింది.



వనపర్తి జిల్లా జనరల్ ఆస్పత్రి వద్ద రోదిస్తున్న మృతుడి తల్లి, అక్క

రామసముద్రం చెరువులో శవమై..

వనపర్తి జిల్లా శ్రీరంగాపుర్ మండలం జానంపేట శివారులోని రామసముద్రం చెరువులో తూము వద్ద శవం ఉన్నట్లు గ్రామస్తులు గుర్తించి సర్పంచ్ వెంకటేశ్వర్‌రెడ్డికి తెలియజేయగా.. ఆయన పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని చెరువులో నుంచి మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడికి షర్టు లేదు.. ట్రాక్ ప్యాంట్‌కు కారు తాళం చెవి కట్టి ఉంది. పోలీసులు తాళం చెవి తీసుకుని కారును ఓపెన్ చేసి చూడగా.. అందులో స్విచ్ ఆఫ్ అయిన సెల్‌ఫోన్ లభించింది. ఆన్‌చేసి ఓపెన్ చేసేందుకు ప్రయత్నం చేయగా లాక్‌వేసి ఉంది. పోలీసులు అందులోని సిమ్ కార్డును తీసి మరో సెల్‌లో వేసి ఆన్ చేశారు. మృతుడి బంధువులకు మణికంఠవర్మ సెల్ అందుబాటులోకి వచ్చినట్లు బుధవారం కాల్ చేసిన అతడి మిత్రులు, బంధువులకు ఎస్ఎంఎస్ వచ్చింది. శివాజీ అనే వ్యక్తి వెంటనే కాల్ చేయగా.. కానిస్టేబుల్ విషయం చెప్పి రమ్మన్నారు. ఈ మేరకు కుటుంబసభ్యులు గురువారం సాయంత్రానికి వనపర్తికి చేరుకున్నారు. శుక్రవారం మృతదేహానికి పోస్టుమార్టం కాగా.. తల్లి, అక్క, కుటుంబసభ్యులు, స్నేహితుల రోదనలు మిన్నంటాయి.

ఆస్తి వివాదమే ప్రాణం తీసిందా?

కొన్నేళ్ల క్రితం మేడ్చల్ జిల్లా దుండిగల్ మండలం గండిమైసమ్మ ప్రాంతంలో మృతుడి తండ్రి ఓ వెంచర్‌లో 340 గజాల ప్లాటు కొనుగోలు చేశాడు. దీని పక్కనే మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ భవన్‌ను నిర్మించారు. దాని పార్కింగ్ కోసం ఆ పార్టీకి చెందిన పలువురు వెంచర్‌లోని ప్లాట్లను చదును చేసేందుకు యత్నించారు. ఇది తెలుసుకున్న మణికంఠవర్మ, తనతో పాటు కొనుగోలు చేసిన వారితో కలిసి కోర్టులో కేసు వేశారు. కోర్టు స్టే ఇవ్వగా.. తహసీల్దార్ స్వయంగా వచ్చి చదును చేసే పనులను నిలిపివేయించారు. ఈ క్రమంలో మణికంఠవర్మ అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఆస్తి వివాదమే ప్రాణం తీసిందని.. ఈ వివాదం తప్ప మాకు ఎలాంటి సమస్యలు లేవని మృతుడి తల్లి, అక్క రోదిస్తూ తెలిపారు.

తెల్లకారు కట్టపై తిరిగినట్లు గ్రామస్తులు చెప్పారు..



గురువారం రామసముద్రం చెరువులో శవం తేలడంతో నేనే పోలీసులకు సమాచారం ఇచ్చాను. బుధవారం సాయంత్రం జానంపేట శివారు చెరువుకు రోడ్డుపక్కన ఎర్రకారు ఆగి ఉంది. ఓ తెల్ల కారు కూడా చెరువుకట్టపై అనుమానాస్పదంగా తిరిగినట్లు గ్రామస్తులు నాకు చెప్పారు.

– వెంకటేశ్వర్‌రెడ్డి, సర్పంచ్, జానంపేట, శ్రీరంగాపూర్

నా తమ్ముడి ప్రాణం కంటే ఏది ఎక్కువ కాదు..

నా తమ్ముడు చాలా ధైర్యవంతుడు. అందుకే మా నాన్న జ్ఞాపకార్థంగా ఆ స్థలాన్ని వదులుకోవద్దని.. మిగతా బాధితులను కూడకట్టుకుని కోర్టులో పోరాడేందుకు ముందుకొచ్చాడు. ఇంతటి దారుణం జరుగుతుందని ఊహించలేదు. లేదంటే నా తమ్ముడి ప్రాణం కంటే మాకు ఆ ప్లాటు ఎక్కువేం కాదు. వదిలేసుకునేవాళ్లం. చెరువు నుంచి మార్చురీకి తరలించినప్పుడు వైద్యులు ఎలాంటి పరిశీలన చేయలేదు. ఒక డాక్టర్‌గా పోస్టుమార్టం చేసే సమయంలో నన్ను అనుమతించాలని కోరితే స్థానిక వైద్యులు నిరాకరించారు.

– డాక్టర్ అన్నపూర్ణాదేవి, మృతుడి అక్క

నేరస్థలంలో ఆధారాలు సేకరించినట్లేనా?

రామసముద్రం చెరువు సమీపంలో రోడ్డు పక్కన మృతుడి కారు పార్కింగ్ చేసి ఉంది. బుధవారం సాయంత్రం చీకటి పడుతున్న సమయంలో కారు పార్కింగ్ చేసి కనిపించినట్లు స్థానికులు చెబుతున్నారు. అక్కడి వరకు కారులో ఎందరు వచ్చారు.. నడిపేది ఎవరు.. ఇందులో ఎవరైనా ఉన్నారా.. వంటి అంశాలు తేలాలంటే ప్రధానంగా స్టీరింగ్, డోర్ ఓపెన్ లివర్‌పై ఉన్న వేలిముద్రలు కీలకం. ఇది సేకరించకుండానే పోలీసులు శ్రీరంగాపూర్ స్టేషన్‌కు తరలించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అంతేకాకుండా.. మృతుడి మణికంఠవర్మ స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమగోదావరి జిల్లా భీమవరం. కానీ వారు హైదరాబాద్‌లోనే స్థిరపడ్డారు. చదువు, ఉద్యోగ ప్రయత్నాలు అంతా మేడ్చల్ జిల్లా బాచుపల్లి మండలం ప్రగతినగర్ నుంచే కొనసాగింది. తనకు ఎలాంటి సంబంధం లేని జానంపేటకు ఎందుకు వచ్చాడు.. అతనే వచ్చాడా.. అతడి వెంట ఇంకెవరైనా ఉన్నారా.. మృతుడి చొక్కా ఎక్కడుంది.. అనే ఎన్నో ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. దీనిపై పోలీసులు మాట్లాడుతూ పోస్టుమార్టం నివేదిక అందిన తర్వాత పూర్తిస్థాయిలో విచారణ చేసి వివరాలు వెల్లడిస్తామని చెప్పారు.

మహిళాసంఘాలకు మరింత ప్రోత్సాహం

- సీతాఫల్ ప్రాసెసింగ్ యూనిట్ భేష్
- కలెక్టర్ రవినాయక్

నవాబుపేట: మహిళా సంఘాలకు మరింత ప్రోత్సాహం అందిస్తామని కలెక్టర్ రవినాయక్ తెలిపారు. శుక్రవారం మండలంలో పర్యటించిన ఆయన తహసీల్దార్, ఎంపీడీఓ, ఉపాధి, మహిళా సమాఖ్య కార్యాలయాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మహిళ సంఘాలు గతేడాది చేపట్టిన సీతాఫల్ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను పరిశీలించి అభినందించారు. ఇతర ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసేలా చేయూతనిస్తామని వారికి హామీ ఇచ్చారు. టమాట ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌కు అనుమతి వచ్చేలా చూస్తామని చెప్పారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో డీటీ లేఖనరెడ్డితో మాట్లాడారు. ధరణి సమస్యలపై వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలన్నారు. సాంకేతికంగా ఇబ్బందులు వస్తే సమాచారం ఇచ్చి, సమస్యను పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన వారితో మాట్లాడారు. యన్మన్‌గండ్లలో కంటి వెలుగు పరిశీలించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ సీతారామారావు, ఎంపీడీఓ శ్రీలత, ఏపీఓ జ్యోతి ఉన్నారు.



నవాబుపేటలో సీతాఫల్ యూనిట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ రవినాయక్

'ఐపాస్'కు సాధ్యమైనంత త్వరగా అనుమతులు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): టీఎస్ ఐపాస్ కింద పరిశ్రమల స్థాపన కోసం వచ్చిన దరఖాస్తులను సాధ్యమైనంత త్వరగా ఆమోదించాలని కలెక్టర్ రవినాయక్ అన్నారు. జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ, ఐటీ ఐపాస్ కమిటీ సమావేశంలో ఐపాస్ కింద పరిశ్రమలస్థాపన అనుమతికై వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. పరిశ్రమల స్థాపనకు 20 శాఖల అనుమతి ఇవ్వాల్సి ఉంటుందన్నారు. సింగిల్ విండో పద్ధతిన వీటన్నింటికి అనుమతులు ఇస్తున్నందున, అన్ని దరఖాస్తులు సక్రమంగా ఉంటే వాటిని అనుమతించాలని చెప్పారు. ఆయా శాఖల లాగిన్‌లో దరఖాస్తులు పెండింగ్‌లో లేకుండా చూసుకోవాలన్నారు. 482 దరఖాస్తులు రాగా కమిటీ 417కు ఆమోదం తెలిపింది. ఔత్సాహిక ఎస్సీ, ఎస్టీ మహిళా పారిశ్రామికవేత్తలకు ఇచ్చే సబ్సిడీ శాతం విషయమై బ్యాంకర్లతో సమీక్షించిన తర్వాత ఆమోదిస్తామన్నారు. జిల్లా పరిశ్రమల మేనేజర్ బాబురావు, ఆర్‌టీఓ నరేష్, డీటీఓ కోమలి, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి సుధాకర్, గిరిజన సంక్షేమ అధికారి ఛత్రునాయక్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ యాదయ్య, మైన్స్ ఏడీ విజయ్‌కుమార్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ రఫీ, తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్లకు పచ్చజెండా

- జిల్లాకు రూ.35.95కోట్లు మంజూరు
- ఉపాధి హామీ నిధులతో 582 రోడ్ల పనులు
- అంచనాలు సిద్ధం చేసి పనులు చేపట్టేలా ప్రణాళిక
- మార్చి నెలాఖరులోగా పూర్తి చేసేందుకు కసరత్తు

మహబూబ్‌నగర్ న్యూటౌన్/జెడ్పీసెంటర్: గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం పచ్చ జెండా ఊపింది. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద అంతర్గత సీసీ రోడ్లను నిర్మించేందుకు ఆయా గ్రామాల్లోని పనులు చేపట్టేలా ప్రభుత్వం అనుమతినిస్తూ జిల్లా కలెక్టర్‌కు ఉత్తర్వు లేఖను పంపారు. గ్రామ పంచాయతీలలో ఉపాధిహామీ నిధులతో పనులు చేపట్టేందుకు రెండు విడతలుగా ప్రభుత్వం రూ.35.95కోట్లు మంజూరు చేసింది. దీనికి సంబంధించి అంచనాలు సిద్ధం చేసి మార్చినెలాఖరులోగా పనులు పూర్తి చేసేందుకు జిల్లా పంచాయతీ రాజ్ శాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికి రెండు విడతలుగా 582 సీసీ రోడ్డు పనులు చేపట్టేందుకు ప్రభుత్వం నుంచి అనుమతులు మంజూరయ్యాయి. పనులను నిర్దిష్టమైన ప్రణాళికతో పూర్తి చేయాలని, రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మహబూబ్‌నగర్ రూరల్, హన్వాడ మండలాల ప్రజాప్రతినిధులు, అధికారులతో సమావేశమై.. సీసీ రోడ్ల నిర్మాణంపై దిశానిర్దేశం చేశారు. ఉపాధి హామీ నిధులతో చేపట్టే ఈ రోడ్డు పనులు నాణ్యతగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.



సీసీగా మారనున్న పల్లెమోనికాలనీ మట్టిరోడ్డు

60:40 నిష్పత్తితో నిధులు

ఉపాధి హామీ చట్టం ప్రకారం నిర్దిష్టమైన ప్రణాళికతో కూలీల ఖర్చు, సామగ్రి ఖర్చులు చేపడుతారు. జిల్లాను యూనిట్‌గా తీసుకొని మొత్తం ఖర్చులో 60శాతం కూలీలకు, 40 శాతం సామగ్రి కింద ఖర్చు చేసేలా ప్రణాళికతో నిధులను ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఈ మేరకు ఆర్థిక సంవత్సరంలో చేసిన ఖర్చుకు అనుగుణంగా పనులను చేపట్టేలా జిల్లాస్థాయిలోని డీసీసీ(పంచాయతీరాజ్) ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణలో సీసీ రోడ్డు పనులను చేపట్టేందుకు చర్యలు తీసుకోనున్నారు. కాగా జిల్లాలో ప్రతి ఏడాది ఉపాధిహామీ నిధులతో చేపట్టే సీసీ రోడ్డు పనులు ఆర్థిక సంవత్సరం ముగిసే ముందు మంజూరు చేయడం, మార్చిలోగా పూర్తి చేస్తే బిల్లులు సకాలంలో వస్తాయని అధికారులు సూచిస్తుండటం గమనార్హం.

■ ఉపాధి హామీ నిధులతో మంజూరైన సీసీ రోడ్డు పనులు మార్చి నెలాఖరులోగా పూర్తి చేస్తేనే బిల్లులు సకాలంలో వచ్చే అవకాశముంటుందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. గతంలో సమయంలోగా పనులు పూర్తి చేయని గ్రామ పంచాయతీలు బిల్లుల విడుదలకు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గత ఆర్థిక సంవత్సరం 2021–22లో మంజూరు చేసిన సీసీ రోడ్లు మార్చి 2022లోగా పూర్తి చేసినా చాలా గ్రామాల్లో బిల్లులు విడుదల కాలేదు. గతంలో గ్రామాల్లో చేపట్టిన సీసీ రోడ్లకు సంబంధించిన బిల్లులు దాదాపు రూ.6 కోట్లు ఇప్పటికీ రాకపోవడం గమనార్హం. ఈనేపథ్యంలో గత అనుభవాలు సవాల్ విసురుతున్నాయి. గతంలో బిల్లులు రాకపోవడంతో తాజా పనుల నిర్వహణపై ప్రభావం చూపుతోంది.

పనులు ప్రారంభిస్తున్నాం..

ఉపాధి హామీ పథకం కింద జిల్లాకు మంజూరైన సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్నాం. అంచనాలు సిద్ధం చేసి గ్రామాల్లో పనులు ప్రారంభించేందుకు ఏఈలు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో ఈసారి రూ.35.95 కోట్ల విలువతో సీసీ రోడ్డు పనులు చేపడుతున్నాం. మార్చి నెలాఖరులోగా పనులు పూర్తి చేస్తే బిల్లులు సకాలంలో వచ్చే అవకాశముంటుందని చెబుతున్నాం.

– నరేందర్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఈఈ



సిడెపై ఊరేగిన జగజ్జనని

- పోలేపల్లికి పోటెత్తిన భక్తులు
- అమ్మవారికి బండారు చల్లి తరించిన జనం

– వివరాలు 8లో

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో రైతు మృతి

గట్టు: మండలంలోని చమన్‌ఖాన్‌దొడ్డి చెందిన రైతు మల్లేష్ (36) శుక్రవారం ఉదయం పొలం వద్ద బోరు మోటార్‌ను ఆన్ చేస్తున్న క్రమంలో విద్యుత్ఘాతానికి గురయ్యాడు. చుట్టు పక్కల వారు విషయాన్ని గమనించి, హుటాహుటిన ఇందువాసి గ్రామంలోని ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్లారు. అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఈ సంఘటనతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. మృతునికి భార్య సరోజమ్మ, కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు. బాధిత కుటుంబాన్ని పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు పరామర్శించారు.

బైకును ఢీకొన్న కారు: వ్యక్తి మృతి

రాజాపూర్: బైకుపై వెళ్తున్న వ్యక్తిని వెనుక నుంచి కారు ఢీకొన్న సంఘటన జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఖానాపూర్ పంచాయతీ పరిధిలోని సోమ్లానాయక్‌తండాకు చెందిన సంతోష్(27) గురువారం రాత్రి రంగారెడ్డిగూడలో తన చికెన్‌సెంటర్‌ను మూసి రాత్రి తన గ్రామానికి తన బైక్‌పై బయలుదేరాడు. రాజాపూర్ శివారులో జాతీయ రహదారిపై యూటర్న్ చేస్తుండగా వెనుక నుంచి కారు వచ్చి ఢీకొంది. సంతోష్‌కు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు వెంటనే మహబూబ్‌నగర్‌లోని ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పట్టాలు దాటుతుండగా ఢీకొన్న రైలు

- యువకుడు మృతి

జడ్చర్ల టౌన్: సిగ్నల్‌గడ్డ సమీపంలో రైలుపట్టాలు దాటుతున్న క్రమంలో రైలు ఢీకొనడంతో మహమ్మద్ అతీఫ్‌ముహీబ్ (20) మృతిచెందినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ కృష్ణ తెలియజేశారు. మొదట గుర్తుతెలియని వ్యక్తిగా భావించి మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రిలో మృతదేహం భద్రపర్చామని తెలిపారు. కుటుంబ సభ్యులు గుర్తించినట్లు పేర్కొన్నారు. ఇంటినుంచి బయటకు వచ్చిన యువకుడు ప్రమాదవశాత్తు మృతి చెందినట్లు ఆయన తెలిపారు.

6 ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కల్వకుర్తి రూరల్: మండలంలోని రఘుపతిపేట దుందుబీ వాగు నుంచి అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తున్న ఆరు ఇసుక ట్రాక్టర్లను శుక్రవారం పట్టుకున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. ఇసుక అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. తెలకపల్లి, నాగర్‌కర్నూల్, బల్మూరు తదితర ప్రాంతాల నుంచి ట్రాక్టర్లు రఘుపతిపేట నుంచి ఇసుకను తరలిస్తున్నాయి. శుక్రవారం చేసిన దాడుల్లో 3 ఇసుకతో కూడిన ట్రాక్టర్లు, మరో మూడు ఖాళీ ట్రాక్టర్లను అదుపులోకి తీసుకుని డ్రైవర్లు, యజమానులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

నల్లబెల్లం, పటిక స్వాధీనం

తెలకపల్లి: సారా తయారీ కోసం విక్రయించడానికి దాచి ఉంచిన నల్లబెల్లం, పటికను ఎక్సైజ్ అధికారులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. సీఐ పరమేశ్వర్ గౌడ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. లింగాల మండలం సూరాపూర్ చెందిన మూడావత్ రాజు తన వ్యవసాయ పొలంలో బావి వద్ద 86 బ్యాగుల నల్లబెల్లం, పౌడర్, 4 బ్యాగుల్లో పటిక దాచి ఉంచారు. పక్కా సమాచారంతో శుక్రవారం గ్రామంలోఎక్సైజ్ అధికారులతో కలిసి దాడులు నిర్వహించారు. వాటిని స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఎట్టకేలకు నిలిచిన 'తుంగభద్ర ఎక్స్‌ప్రెస్'



దేవరకద్ర: పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో శుక్రవారం తుంగభద్ర, ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలపడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీ మన్నెశ్రీనివాస్‌రెడ్డి కృషి ఫలితంగానే దేవరకద్ర జంక్షన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలిపారని బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. ఉదయం 7:20 గంటలకు కర్నూల్ వైపు నుంచి సికింద్రాబాద్ వెళ్లే ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్‌ను ఇక్కడ నిలిపారు. అలాగే సాయంత్రం 4:30 గంటలకు కర్నూల్ నుంచి సికింద్రాబాద్ వెళ్లే తుంగభద్ర ఎక్స్‌ప్రెస్ రైలు నిలిపారు. దీంతో తుంగభద్ర ఎక్స్‌ప్రెస్ రైలుకు బీఆర్ఎస్ నాయకులు స్వాగతం పలికి పూజలు చేశారు. ప్రయాణికులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దేవరకద్ర నుంచి కాచిగూడ వరకు కేవలం రూ.60 మాత్రమే టికెట్ ధర ఉందని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జట్టి నర్సింహారెడ్డి, నరేందర్‌రెడ్డి, శ్రీకాంత్‌యాదవ్, వెంకటేష్, కొండ శ్రీనివాస్‌రెడ్డి, ఆంజనేయులు, చల్మారెడ్డి, ఈవో సీత్యానాయక్ పాల్గొన్నారు.

సిడెపై ఊరేగిన జగజ్జనని

- పోలేపల్లికి పోటెత్తిన భక్తులు
- 50 అడుగుల ఎత్తులో రథాన్ని లాగుతూ దేవాలయం చుట్టూ ప్రదక్షిణ
- అమ్మవారికి బండారు చల్లి తరించిన జనం



కోస్గి: మండలంలోని పోలేపల్లి ఎల్లమ్మ దేవస్థానం జనసంద్రంగా మారింది. శుక్రవారం సాయంత్రం బ్రహ్మోత్సవాల్లో భాగంగా సిడె (రథోత్సవం) నిర్వహించారు. భక్తులు అమ్మవారికి బోనపు పటువలతో, కోడి పుంజులతో, వేపాకులు ధరించి శివసత్తుల పూనకాలతో, డప్పుల మోతల నడుమ పూజలు చేసి, ప్రసన్నాలు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాలతోపాటు పొరుగు రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటక భక్తుల రాకతో ప్రాంగాణమంతా జనంతో కిటకిటలాడింది. ఎల్లమ్మ మాతాకి జై.. మావురాల ఎల్లమ్మ మాపై కరుణ చూపమ్మ అంటూ.. భక్తులు సిడె ఘట్టంలో పసుపు బండారు చల్లుతుండగా జగజ్జనని సిడెపై ఊరేగింది. ఉదయం నుంచి ప్రత్యేక పూజలతో అమ్మవారికి మొక్కులు తీర్చుకొని సాయంత్రం కన్నుల పండగగా సిడెను భక్త కోటి తిలకించి తరించారు. అమ్మవారికి బండారు చల్లుతూ ఎల్లమ్మ నామస్మరణతో తరించిపోయారు. అమ్మవారి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన ఊయలలో ఉంచి సుమారు 50అడుగుల ఎత్తులో నుంచి రథాన్ని లా గుతూ దేవాలయం చుట్టు ప్రదక్షిణ చేయించారు.



సిడెను మొక్కుతున్న భక్తులు



ఆలయంలో హారతి ఇస్తున్న పూజారి



పూజల్లో ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి తదితరులు

ఎల్లమ్మను దర్శించుకున్న ప్రజాప్రతినిధులు

బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు అమ్మవారిని దర్శించుకొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ వెంకటేష్, ఈఓ రాజేందర్, ఎంపీపీ మధుకర్‌రావు, జెడ్పీటీసీ ప్రకాష్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ రామకృష్ణ, మున్సిపల్ చైర్ పర్సన్ శిరీష, నాయకులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

ఉత్సవాలకు భారీ బందోబస్తు

బ్రహ్మోత్సవాల నేపథ్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. నారాయణపేట డీఎస్పీ సత్యనారాయణ, సీఐ జనార్దన్ ఆధ్వర్యంలో ఎస్ఐలు, ఏఎస్ఐలు, కానిస్టేబుల్స్, మహిళ పీసీలు, హోంగార్డులు, ఇతర ప్రత్యేక సిబ్బంది విధులు నిర్వహించారు. దొంగతనాలు, అవాంఛనీయ సంఘటనలు కాకుండా నిఘా ఏర్పాటు చేశారు.



బోనాలతో ఆలయానికి వస్తున్న మహిళలు



దర్శనానికి బారులు తీరిన భక్తులు

పెళ్లిలో ఫొటో గొడవ

- కొట్టుకున్న వరుడి స్నేహితులు, వధువు బంధువులు

నవాబుపేట: పెళ్లి కోసం వచ్చిన బంధువులు, స్నేహితుల మధ్య ఫొటో దిగేందుకు వాగ్వివాదం చోటుచేసుకొని గొడవకు దారితీసిన ఘటన మండలంలోని లోకిరేవు గ్రామంలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వరుడు గొర్రెంక సుధాకర్ స్నేహితులు ఫొటో దిగేందుకు స్టేజీ పైకి వెళ్తుండగా, అమ్మాయి తరఫు బంధువులు అదే సమయంలో మేము ఫొటో దిగుతామని అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య గొడవ మొదలై మాటామాట పెరిగి కర్రలు, రాళ్లతో కొట్టుకునే వరకు వెళ్లింది. ఈ ఘటనలో కావేల వెంకటయ్య, నర్సింహులు, కేశవులు, బాలకిష్టయ్య గాయపడ్డారు. గాయపడిన వారు పోలీస్‌స్టేషన్‌లో దాడిచేసిన వారిపై ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పురుషోత్తం తెలిపారు.

నేటినుంచి పద్య నాటకోత్సవాలు

స్టేషన్ మహబూబ్‌నగర్: రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో, మన్యంకొండ దేవస్థానం సహకారంతో శనివారం నుంచి 15వ తేదీ వరకు మన్యంకొండ క్షేత్రంలో పద్య నాటకోత్సవాలు నిర్వహిస్తున్నట్లు శ్రీమిత్ర కళా నాట్యమండలి అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, నారాయణ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. శనివారం రాత్రి 7 గంటల నుంచి శాస్త్రీయ నృత్య ప్రదర్శన, శ్రీకృష్ణ రాయబారం, అల్లూరి సీతారామరాజు ఏకపాత్రాభినయం ఉంటుందని తెలిపారు. 12న శ్రీకృష్ణ రాయబారం, ధర్మజ రాజసూయం, 13న శ్రీరామాంజనేయ యుద్ధం ఘట్టం, శ్రీకృష్ణ రాయబారం, శ్రీకృష్ణాంజనేయ యుద్ధఘట్టం, మాయల పకీర్ మరణవేదన ఏకపాత్రాభినయం, 14న శ్రీకృష్ణ రాయబారం, శ్రీరామాంజనేయ యుద్ధఘట్టం, 15వ తేదీన భజనలు, హరినామ సంకీర్తన కార్యక్రమాలు ఉంటాయని వివరించారు.

సీనియర్ నేషనల్ పోటీలో అనన్యశ్రీ ఘనత

- కేరళ రాష్ట్ర జట్టుకు ప్రాతినిథ్యం
- బంగారం పతకం కైవసం

మహబూబ్‌నగర్ క్రీడలు: ఉమ్మడి జిల్లాలోని మక్తల్‌కు చెందిన అనన్యశ్రీ వాలీబాల్ క్రీడలో అరుదైన ఘనత సాధించింది. అసోం రాష్ట్రం గౌవహటిలో ఈనెల 2వ తేదీ నుంచి 9 వరకు నిర్వహించిన 71వ ఉమెన్ సీనియర్ నేషనల్ వాలీబాల్ పోటీలకు కేరళ రాష్ట్ర జట్టుకు ఈమె ప్రాతినిథ్యం వహించింది. సీనియర్ నేషనల్ వాలీబాల్ చాంపియన్‌షిప్‌లో కేరళ మహిళా జట్టు విజేతగా నిలవడంతో అనన్యశ్రీ బంగారు పతకం సాధించింది.

పలు సార్లు జాతీయస్థాయిలో ప్రతిభ

అనన్యశ్రీ తెలంగాణ, కేరళ రాష్ట్ర జట్టుకు ప్రాతినిథ్యం వహించడం విశేషం. రాష్ట్రం నుంచి అనన్యశ్రీ 2018 పంజాబ్ (చండీఘర్)లో జూనియర్ నేషనల్ వాలీబాల్ టోర్నీలో రాష్ట్రానికి ప్రాతినిథ్యం వహించింది. 2019లో తమిళనాడు రాష్ట్రం ధర్మపురి, 2020 కడపలో జూనియర్ నేషనల్ వాలీబాల్ పోటీల్లో పాల్గొంది. కేరళ రాష్ట్ర తరపున గతేడాది ఉత్తరాఖండ్ రాష్ట్రం రుద్రాపూర్‌లో 23వ జాతీయస్థాయి, మహారాష్ట్ర సాంగ్లి జిల్లా ఇస్లాంపూర్‌లో 24వ జాతీయస్థాయి యూత్ వాలీబాల్ పోటీల్లో పాల్గొంది. కేరళలో సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ, మహారాష్ట్ర కొల్హాపూర్‌లో సీనియర్ లీగ్ (హరియంట్ చసాక్) వాలీబాల్ టోర్నమెంట్‌లో పాల్గొంది. ఈ మూడు టోర్నీల్లో కేరళ జట్టు విన్నర్‌గా నిలిచింది.



సీనియర్ నేషనల్ విన్నర్ ట్రోఫీతో అనన్యశ్రీ

ప్రభుత్వం 'ధరణి'ని రద్దు చేయాలి

- మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్ క్రైం: ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణి సైట్‌తో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వెంటనే రద్దు చేయాలని మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వెబ్‌సైట్‌లో మార్పులు చేర్పులు చేయాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఒకరి భూములు మరోకరి పేరుపై వెళ్తున్నాయని తెలిపారు. రాష్ట్రంలో కొనసాగుతున్న తుగ్లక్ పాలనలో మంత్రులు ఎమ్మెల్యేలు నిమిత్త మాత్రమే అని విమర్శించారు. శ్రీశైలం ఎడమ కాల్వలో నీటి చౌర్యాన్ని అడ్డుకోకపోతే రాబోయే నెలలో తాగు, సాగునీటికి కటకట ఏర్పడుతుందని, ఎమ్మెల్యేలు, మంత్రులు వెంటనే స్పందించి రైతుల ప్రయోజనాలను కాపాడాలని కోరారు. ప్రధాని నరేంద్ర మోడీ పార్లమెంటులో కాంగ్రెస్ పార్టీ ఏమి చేయలేదని పేర్కొనడం దారుణమన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి సంస్కరణలు అమలు చేసిన చరిత్ర కాంగ్రెస్ పార్టీకి ఉందన్నారు. సమస్యలతో దేశం సతమతమవుతున్నా ప్రధాని మాత్రం ఆదాని, అంబానీలకు ప్రజాధనాన్ని కట్టబెట్టేందుకు చూస్తున్నారని మండిపడ్డారు. సమావేశంలో శశిధర్‌రెడ్డి, రవి, రోహిణి, గోవర్దన్‌రెడ్డి, సుమిత్ర, నారాయణగౌడ్, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాగం జనార్దన్‌రెడ్డి

వడ్ల బస్తాల్లో కంకర రాళ్లు

- 112 బస్తాలు స్వాధీనం చేసుకున్న అధికారులు

జడ్చర్ల టౌన్: వడ్ల బస్తాల్లో కంకరరాళ్లు కలిపి విక్రయిస్తున్న ఘటన బాదేపల్లి పట్టణంలో శుక్రవారం రాత్రి వెలుగు చూసింది. వివరాల్లోకి వెళితే.. ఎస్పీ ఆదేశాల మేరకు సీఐ రమేష్‌బాబు, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, విజిలెన్స్ అధికారి బాలరాజు శుక్రవారం రాత్రి పట్టణ శివారులోని సత్యసాయి రైస్‌మిల్‌లో తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో మిల్ మూసి ఉన్నప్పటికి ఆవరణలో నిల్వ చేసిన బస్తాలను పరిశీలించారు. 112 బస్తాలు ఉండగా ఒక్కో బస్తా 60కిలోలుగా ఉంది. అందులో వడ్లతో పాటు 6కిలోల కంకర రాళ్లు నింపి ఉండటాన్ని అధికారులు గుర్తించారు. మిల్ ఆవరణలోనే పెద్ద ఎత్తున కంకర నిల్వలు గుర్తించారు. యజమాని అందుబాటులో లేకపోవటంతో ప్రస్తుతానికి బస్తాలు సీజ్ చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. శనివారం ఉదయం మిల్ తెరిచి చూస్తామని, కంకర రాళ్లతో కూడిన వడ్లను ఎక్కడికి పంపిస్తున్నది విచారిస్తామని తెలిపారు. గురువారం పట్టణంలో భారీగా కల్తీ టీ పొడి లభించగా, శుక్రవారం వడ్లల్లో కంకరరాళ్లు కలిపి ఉండటం వెలుగు చూడటంతో జడ్చర్ల కల్తీకి కేరాఫ్‌గా మారుతుందని జోరుగా చర్చించుకుంటున్నారు.



వడ్ల బస్తాల్లో కలిపిన కంకరరాళ్లు



పరిశీలిస్తున్న అధికారులు

1,020 అడుగుల నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో శుక్రవారం 1,020 అడుగుల వరకు నీటి మట్టం వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 200, సమాంతర కాల్వ ద్వారా 157 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. ఎన్టీఆర్ కాల్వ ద్వారా 250, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు.

బాలిక ఆత్మహత్యకు కారణమైన బాలుడికి జైలుశిక్ష

మిడ్జిల్: బాలికను ప్రేమించి పెళ్లికి నిరాకరించడంతో ఆత్మహత్యకు పాల్పడడంతో అందుకు కారణమైన బాలుడికి శుక్రవారం జువైనల్ కోర్టు జైలు శిక్ష విధించింది. ఎస్ఐ రామ్‌లాల్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఓ తండాకు చెందిన బాలిక, ఊర్కొండ మండలంలోని తండాకు చెందిన బాలుడు ప్రేమించుకున్నారు. కాగా బాలిక గర్భావతి కావడంతో పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి తీసుకురాగా, బాలుడు అందుకు నిరాకరించాడు. దీంతో 2019లో బాలిక ఆత్మహత్యకు పాల్పడింది. అప్పట్లో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. శుక్రవారం జిల్లా జువైనల్‌లో కోర్టులో ప్రవేశపెట్టగా బాలుడికి మూడేళ్ల జైలు శిక్ష పడినట్లు ఎస్ఐ వివరించారు.

మైనర్‌ను పెళ్లి చేసుకున్న వ్యక్తి రిమాండ్

నవాబుపేట: బాలికను పెళ్లి చేసుకున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు మహబూబ్‌నగర్ రూరల్ సీఐ రాజేశ్వర్‌గౌడ్ తెలిపారు. శుక్రవారం స్థానిక ఎస్ఐతో కలిసి ఆయన వివరాలు వెల్లడించారు. మండలంలోని కారుకొండ చెందిన బ్యాగరి బాలరాజు బాలికను ప్రేమ పేరుతో మోసం చేసి పెళ్లి చేసుకున్నాడని తెలిపారు. ఈ మేరకు తల్లిదండ్రుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. మైనర్‌లను ప్రేమ పేరుతో మోసం చేయటం నేరమని వారికి మైనార్టీ తీరితేనే వారి అంగీకారం పరిగణలోకి వస్తుందని వస్తుందని సీఐ తెలిపారు.

బోర్డు ధ్వంసం చేసిన వ్యక్తుల రిమాండ్

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లా కేంద్రంలోని మెట్టుగడ్డ వద్ద ఉన్న 'మన మహబూబ్‌నగర్' బోర్డును ధ్వంసం చేసిన వ్యక్తులను అదుపులోకి తీసుకుని శుక్రవారం రిమాండ్ తరలించినట్లు రూరల్ సీఐ రాజేశ్వర్‌గౌడ్ వెల్లడించారు. తిమ్మాసానిపల్లికి చెందిన మోహన్, బృందావన్ కాలనీకి చెందిన నర్సింహాతో పాటు మరో బాలుడు కలిసి ఈనెల 5న తెల్లవారు జామున మెట్టుగడ్డ వద్ద ఉన్న 'మన మహబూబ్‌నగర్' బోర్డును ధ్వంసం చేశారని తెలిపారు. ఇందులో మోహన్, నర్సింహను జిల్లా జైలుకు తరలించగా, బాలుడిని జువైనల్ కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. వారి నుంచి మూడు సెల్‌ఫోన్లు, ఒక బైక్ స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేస్తాం

- బీజేపీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి రాణిరుద్రమదేవి



మాట్లాడుతున్న రాణిరుద్రమదేవి

పాలమూరు: పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడం కోసం కార్నర్ సమావేశాలు ఏర్పాటు చేసినట్లు బీజేపీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి రాణిరుద్రమదేవి అన్నారు. జిల్లా కేంద్రంలోని మర్లులో శుక్రవారం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఇంటింటి కార్నర్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి బూత్ కేంద్రంలో పార్టీని బలోపేతం చేయడానికి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు అందులో జిల్లా నాయకులు పాల్గొంటారన్నారు. కుటుంబ, అరాచక పాలన నుంచి ప్రజలను కాపాడటంతో పాటు బీఆర్ఎస్ పార్టీకి ప్రత్యామ్నాయంగా బీజేపీ ఉందనే విషయాన్ని ప్రజలు నమ్ముతున్నట్లు తెలిపారు. తాజాగా ప్రవేశపెట్టిన బడ్జెట్ వారి అవసరాల కోసం ఏర్పాటు చేసుకున్నట్లు ఉందన్నారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వీర బ్రహ్మాచారి, పద్మజారెడ్డి, నారాయణయాదవ్, పాండురంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజీతో ఇరువర్గాలకు న్యాయం

- నేడు జాతీయ లోక్ అదాలత్
- జిల్లాలో 3,700కేసులు రాజీ కోసం గుర్తింపు

మహబూబ్‌నగర్ క్రైం: న్యాయస్థానాల్లో ఎన్నో కేసులు వివిధ కారణాలతో పెండింగ్‌లో ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో లోక్ అదాలత్‌లో ఇరు వర్గాలను ఒకే వేదికపై హాజరుపర్చి న్యాయమూర్తుల సమక్షంలో సమస్యలను రాజీ పద్ధతిలో వెంటనే పరిష్కరిస్తారు. న్యాయ సేవల గురించి వివరాలు తెలుసుకోవాలనుకునేవారు ఉచిత హెల్ప్‌లైన్ 15100ను సంప్రదించవచ్చు. శనివారం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కేంద్రంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నారు.

3,700 కేసుల గుర్తింపు

జిల్లాలో లోక్ అదాలత్‌లో మొత్తం 3,700 కేసులను పరిష్కరించడానికి కోర్టుతో పాటు పోలీస్ శాఖ గుర్తించింది. రాజీ అయ్యే కేసుల్లో ప్రధానంగా క్రిమినల్, సివిల్, ప్రీ లిటిగేషన్, ఇన్సూరెన్స్, బ్యాంకు, ఎలక్ట్రిసిటీ, భూ తగదాలు, ఎక్సైజ్, మోటార్ వెహికల్, చిట్‌ఫండ్, చెక్ బౌన్స్ కేసుల్లో రాజీ అయ్యే అవకాశం ఉంది. మహబూబ్‌నగర్ కోర్టులో 4 బెంచీలు, జడ్చర్ల కోర్టులో ఒక బెంచీ ఏర్పాటు చేశారు. ఇప్పటికే కేసులు అధికంగా పరిష్కారం కోసం రావడానికి సంబంధిత న్యాయవాదులతో పాటు ఇన్సూరెన్స్ కంపెనీలు, ఆర్టీసీ, బ్యాంకు, పోలీస్ అధికారులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. రాజీ అయ్యే కేసులలో ప్రధానంగా డ్రంకన్‌డ్రైవ్, ఈ-పెట్టి, ఎంవీఐ యాక్టు, డిజాస్టర్ మెనేజ్‌మెంట్ కేసులు పరిష్కారిస్తారు.



ఇలాంటి కేసుల్లో రాజీ లేదు

హత్యలు, హత్యాయత్నాలు, అత్యాచారాలు, మైనర్లపై లైంగిక దాడులు, దొంగతనాలు, దోపీడీలు, ప్రత్యేక చట్టాలపై నమోదైన కేసులను, క్రూరమైన కేసును లోక్ అదాలత్‌లో రాజీకి వీల్లేదు.

ఖైదీలకు లోక్ అదాలత్

చిన్న నేరాలు చేసి బెయిల్ మంజూరైనప్పటికి జామీను సమర్పించకపోతే కొంత మంది నిందితులు చాలా కాలంగా జైల్లో ఉంటారు. ఇలాంటి నిందితుల గురించి ప్రభుత్వంపైనా ఖర్చు పెరుగుతుంది. న్యాయమూర్తులు స్వయంగా జైలుకు వెళ్లి అక్కడి నిందితుల కేసులను పరిశీలిస్తారు. ఖైదీలు సన్మార్గంలో జీవిస్తామని హామీ ఇచ్చి నేరం అంగీకరించడంతో కొద్దిపాటి శిక్షతో లోక్ అదాలత్ తీర్పు ఇస్తాయి. ఇలాంటి వాటిలో చాలాకాలంగా ఉంటున్న చిన్నపాటి నేరస్తులు వెంటనే విడుదలకు నోచుకుంటారు.

లోక్ అదాలత్ ద్వారా లాభాలు

- ఈ సేవలను వినియోగించుకునేందుకు రుసుములు చెల్లించాల్సిన అవసరం లేదు.
- వీటి ద్వారా కేసులను పరిష్కరించుకుంటే దావావేసే సమయంలో కోర్టుకు చెల్లించే ఫీజులను తిరిగి చెల్లిస్తారు.
- దావా వేసిన తర్వాత సాక్షుల విచారణ, వాయిదాలతో కాలయాపన అవుతుంది. లోక్ అదాలత్‌లో తీర్పులు వెంటనే వెలువడుతాయి.
- లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం అయితే పైకోర్టుకు వెళ్లే అవకాశం ఉండదు.
- కోర్టులోనే దావా దాఖలు చేయాలన్న నిబంధన లేదు. కోర్టులో దాఖలు కాని కేసులను స్వయంగా వచ్చి తెలిపినా ఎలాంటి ఖర్చు లేకుండా ఇరువర్గాలకు నోటీసులు జారీ చేసి పరిష్కారిస్తారు.

న్యాయ సేవాధికార సంస్థ సాయం

ప్రజలకు సమస్య ఏర్పడితే మండల, జిల్లా స్థాయిలో ఉన్న న్యాయ సేవాధికార సంస్థను ఆశ్రయించి వారి సమస్యను చెప్పవచ్చు. ఏదైనా తగాదా ఏర్పడితే న్యాయస్థానంలో దావా దాఖలు చేయకంటే ముందు నేరుగా న్యాయసేవా అధికార సంస్థను ఆశ్రయిస్తే ప్రతివాదులకు నోటీసులు జారీ చేసి లోక్‌అదాలత్ కార్యక్రమం ద్వారా ఇరువర్గాల సమస్యను పరిష్కరించి వెంటనే తీర్పు చెబుతారు. ఇవే కాకుండా న్యాయస్థానాల్లో దాఖలైన కేసులను కూడా లోక్ అదాలత్ పరిష్కరించుకోవచ్చు.